# ఋణానుబంధం

అప్పుడే గోదావరి ఎక్స్‌ప్రెస్ వచ్చి వెళ్ళింది. అంతవరకూ కోలాహలంగా వున్న ప్లాట్‌ఫారం సందడి తగ్గింది. కొంతమంది ఇంకా కూలీలతో బేరాలాడుతున్నారు.

అక్కడే టీస్టాల్‌లో పనిచేస్తూ ఒకనాడు ఖాళీ కప్పులకోసం పరుగెట్టి అప్పటికే వేగం పుంజుకున్న ట్రైన్‌లోంచి దిగుతూ బండిక్రింద పడి కాలు పోగొట్టుకున్న కుంటి నరిసిగాడు అక్కడ అడుక్కుంటున్నాడు కర్ర చంకక్రింద పెట్టుకొని కుంటుకుంటూ.

షంటింగు ఇంజను కిందపడి కాలుపోయిన కుక్కకూడా మూడు కాళ్ళతో కుంటుకుంటూ ఆ టీస్టాల్ దగ్గర పడవేసిన ఎంగిలాకులు నాకుతూంది...

పుస్తకాలమ్మే వాళ్ళూ, వేరుసెనగలమ్మే వాళ్ళూ ముష్టివాళ్ళూ, వెయిటింగ్ హాల్లోకి చేరుకుంటున్నారు మళ్ళీ బండికోసం ఎదురుచూస్తూ..

"బాబుగారూ మళ్ళీ బ్రిడ్జికింద ఎవడో సచ్చినాడు!" అని పోర్టరు వచ్చి చావుకబురు చల్లగా చెప్పేడు.

"శుభం! ఇంకా డ్యూటీకి వచ్చీ రాకుండానే మంచి కబురు మోసుకొచ్చావు?" అంటూ నుదుటిమీద చేతులు వేసుకొని చికాకు పడ్డాడు స్టేషన్ మాస్టర్.

ఆ కబురుచెప్పి చల్లగా జారుకున్నాడు పోర్టరు.

"ఎక్కడెక్కడినుంచో వచ్చి ఇక్కడ చస్తారు వెధవలు. రైల్వే ప్లాట్‌ఫారాలూ, వెయిటింగ్ రూములూ, రైల్వే లైనులూ ఇవే దొరుకుతాయి. ఇక ఈ శవాలకి కర్మకాండ జరపడం నాపని!" అని విసుక్కుంటూనే ఫోన్ తీశాడు.

"అబ్బబ్బ! ఇదేం బాధండీ రోజుకోకేసా! అయినా ముష్టివెధవలు జబ్బువాళ్ళూ దిక్కులేనివాళ్ళూ, తిండిలేనివాళ్ళూ చస్తే నేను సర్టిఫై చేసేదేమిటి? అదేమిటో ఈ రూల్స్ వీళ్ళూ...సరే వస్తున్నానుండండి?" అని డాక్టరుగారు చీదరించుకున్నారు ఫోనులో ఆ కబురు వినేసరికి!

"మళ్ళీ మరోకేసా. వీళ్ళు చావడం కాదుగాని మా ప్రాణాలు పోతున్నాయి. వీళ్ళను డిస్పోజ్ చేసేసరికి గుర్రం గుడ్డిదయినా తిండికి లోటు లేదన్నట్టు ఇన్వెస్టిగేషన్ తప్పదు కదా. ఈ రోజంతా ఈ శవంతోనే అయిపోతుంది" అని పోలీసు ఇన్స్పెక్టరు కోపగించుకున్నాడు.

"బాబూ మావల్ల కాదండీ! లోకల్‌గా ఎవరినయినా తెచ్చుకొని అయిందనిపించండి. ఆ శవాన్ని ఈడవడానికి కనీసం పాతిక రూపాయిలన్నా అడుగుతున్నారు స్వీపర్లు గవర్నమెంటు అయిదు రూపాయలిస్తుంది. మిగతాది ఎవరు భరిస్తారు?" అన్నాడు శానిటరీ ఇన్స్పెక్టరు.

"అయిదు రూపాయలిత్తే మేంరాం అని సెప్పండిబాబూ మాస్టరుగారికి! నలుగురుండాల! ఆ సచ్చినోడు ఏ జబ్బుతో సచ్చాడో, ఎలా సచ్చాడో, ఆ కంపూ రొంపూ అంతా బరించాల! అయిదు రూపాయలకి ఈరోజుల్లో ఏటొత్తది బాబూ! మనిషి కోకాయన్నా రావాలా?"

అని అక్కడున్న స్వీపర్లు మొదలెట్టేరు.

ఈవిధంగా అందరూ ఆ అనాథప్రేతానికి సంస్కారం చేయడానికి విసుక్కుంటూ చికాకుపడుతూ ఏవగించు కుంటున్నారు కాని అందరూ ఉద్యోగానికి కట్టుబడిన వారే! ఎవరి పని వారు చేయక తప్పదు అయినా ప్రతిసారీ ఇదే వరస!

అనాథ ప్రేత దహన సంస్కారం చాలా పుణ్యమని చెప్పుకుంటారు. కాని పుణ్యంమాట దేము ఎరుగు ఆ బ్రిడ్జి క్రిందే అందరూ వచ్చి చావడం అందరికీ ఆశ్చర్యంగానే వుంది.

అది రైల్వే బ్రిడ్జి. ప్రయాణీకులు రైలు పట్టాలు దాటకుండా. ఈ వైపు నుంచి ఆ వైపుకి ఓవర్ బ్రిడ్జి అన్నమాట! ఆ బ్రిడ్జి మెట్ల క్రింద ఆచ్ఛాదనలా వుంటుంది. ఆ ఆచ్ఛాదనలోనే కనీసం వారానికి ఇద్దరయినా ఈ లోకాన్ని విడిచి వెళుతూంటారు.

అది రైల్వే జాగా కాబట్టి అక్కడ శవాల్ని అలా చూస్తూ వూరుకుందికి వీల్లేదు. అధికారులు వెంటనే ఆ శవానికి అంత్యక్రియలు జరిపెయ్యాలి.

అందుచేత అక్కడి అధికారులకి ఇదొక న్యూసెన్స్ క్రిందతయారయింది. అక్కడ చచ్చేవాళ్ళు ఆకలితోనో, మందులులేకో, కాలం తీరిపోయో. దిక్కులేక చచ్చిపోయినా మరే అనుమానించ దగ్గ కారణాలు లేకపోయినా. అక్కడ అధికారులు రూలు ప్రకారం చేయవలసిన పనులన్నీ చేయక తప్పదు కదా

దిక్కులేని వారిని, బీదవారిని, ముష్టివారిని, జబ్బుల వాళ్ళని, పిచ్చివాళ్ళని ఎవరు గుమ్మాల్లో వుండనిస్తారు? ఎవరు ఆదరిస్తారు? ఎండకి వానకీ, చలికీ ఎక్కడకు పోగలరు? సాధారణంగా ఇలాటి వాళ్ళు ఈ రైల్వే ప్లాట్ ఫారాలూ, రెండవ తరగతి విశ్రాంతి గృహాలూ, రైల్వే బ్రిడ్జిలూ ఆశ్రయిస్తారు.

పగలల్లా ఎక్కడో ముష్టి ఎత్తుగొని రాత్రి అయేసరికి ముష్టి సంసారాలతో సహా ఈ జాగాలకి చేరుకుంటారు.

రూలు ప్రకారం వీళ్ళని అక్కడకూడా చేరనివ్వకూడదు గాని అందరూ తగిలేస్తే మరెక్కడ బతుకుతారు? అనే మానవత్వంతో చూసీ చూడనట్టు వూరుకుంటారు అధికారులు.

అదే వాళ్ళకు ఇలాంటి సమస్యలను కూడా తెస్తుంది.

అయితే. ఆ బ్రిడ్జి క్రిందకు వస్తున్న వాళ్ళందరూ చస్తున్నారా? లేక బ్రిడ్జి క్రిందకు చావడానికే వస్తున్నారా? చావు రాసి పెట్టిఉన్నవాళ్ళే ఆ బ్రిడ్జిక్రిందకు వస్తున్నారా, అదే అందరికీ ఆశ్చర్యం.

బాగా బతుకుతున్న వాళ్ళకేకాదు! రోగంతోనూ, ఆకలితోనూ బాధ పడుతూ అలసి అలసి ఇంక చావొస్తే బావుణ్ను అనుకొనేవారు కూడా అంత యమబాధలోనూ కాస్తంత సుఖంగా, సుళువుగా ప్రాణాలు విడవా లని అనుకుంటారు కాబోలు అంత హీనమయిన స్థితిలోనూ వర్షం,ఎండా చలీ, గాలీ తగలని చోటు కోసం వెతుక్కుంటూ డేకురుకుంటూ, పాకురు కుంటూ వచ్చి చేరుకుంటారు హాయిగా శవాలయిపోతారు.

అక్కడయితే చచ్చిన తర్వాత తమకు అంత్యక్రియలు చేయడా నికి గవర్నమెంటువారు ఏర్పాటు చేస్తారని వాళ్ళు ముందే ఆలోచించు కుంటారు కాబోలు.

ఆ అభాగ్యుల ఈ మూగబాధ, కోరిక ఎవరికి తెలుస్తుంది?దిక్కు లేని శవం అనగానే అందరికీ అసహ్యమే!

అధికారుల వరకూ ఈ కబురు వెళ్ళేలోపునే ఆ శవంచుట్టూ కొందరు చేరేరు దహనం కోసమని వచ్చి పోయేవాళ్ళను అడిగి డబ్బులు అందుకోడం మొదలెట్టేరు.

"ఎగిరిపోనాది సిలక...ఎందుకేడుత్తార్రా ఎగిరిపోతామొకనాడు మరి తిరిగి రాముగా!" అని పాడుతున్నట్టు రాగాలు తీస్తూ...ఒకపిచ్చిది ఆ చుట్టూనే తిరుగుతుంది. దగ్గరగా రాబోతే దగ్గరకు రానివ్వకుండా తగుల్తున్నారు

"ఎదవల్లారా ఏం పనిరా అది...ఆ దెవుడో బతికినన్నాళ్ళూ గంజయినా ఒయ్యనేదుగాని...ఇప్పుడాడిని అడ్డం ఎట్టుకొని చావుకూడు తింటున్నార్రా ...ఛూ" అని తిడుతూంది.

ఆ పిచ్చిదాని మాటలు ఎవళ్ళూ లెక్క చేయలేదు. వారి పని వారిదే

"ఎల్లెల్లే పిచ్చి నంజా!" అని కసురుతూ.

బాబూ దరమం! దరమంసేయండి! బాబూ దిక్కులేని శవం మీకు పుణ్యముంటాది...దగనం చేయాల దరమంసేయండి బాబూ!" అని అరుస్తున్నారు.

రైళ్ళకు వెళుతూ వస్తూన్న వాళ్ళు కొందరటువయిపు చూస్తున్నారు. కొందరు చూడనేలేదు. కొందరు చూసినా ముఖం ఇంకో వయిపు తిప్పుగొని పోతున్నారు. ఎవరో ధర్మం చేస్తున్నారు.

ఎవరి గొడవ వారిది! ఎవరి తొందర వారిది! ఎవరి ప్రయాణం వారిది.

ఒకడు ప్రక్కనే ఈ జీవిత ప్రయాణాన్ని చాలించాడు...మరి వీళ్ళందరూ ఇంకా ఎక్కడికో రైలు ప్రయాణం చేస్తున్నారు

ఆ చచ్చిన వాడిని అంతిమ యాత్రకు సిద్ధం చేయడానికి పోలీసులు, స్వీపర్లు రావడం...ఎవరి మానాన్ని వాళ్ళు దొరికిన డబ్బు పట్టుకు పారిపోవడం జరిగింది.

పిచ్చిది మాత్రం దూరంగా అక్కడే ఉంది. కాని మరి నోరెత్త లేదు. భయం భయంగా, ఒదిగి అంతా చూస్తున్నది.

పోలీసులు అనవాయితీ ప్రకారం విచారణ జరిపినట్టే జరిపిదిక్కులేనివారు చనిపోయినట్టు రికార్డులో వ్రాసి, పాకీవాళ్ళకి అప్పజెప్పి వెళ్ళిపోయారు.

వాళ్ళు నలుగురూ ఊగిపోతూ, జోగిపోతూ వచ్చి, ఆ శవాన్ని ఒక చాపకు చుట్టబెట్టి చచ్చిన గాడిదను మోసుకు వెళ్ళినట్టు ఒక కర్రకు కట్టి భుజాల కెత్తుగున్నారు.

పిచ్చిదిఅదంతా చూస్తూ పెద్దగా ఏడవడం మొదలెట్టింది. జంతువు కన్నా కష్టంగా ఒక మనిషిని వాళ్ళు అలా తీసుకుపోతూ ఉంటే పిచ్చిదయినా ఆమె భరించలేకపోయింది. ఆమె వెర్రి మనసు కరిగిపోయింది. గుండెలు బాదుకొని ఏడ్చింది.

"మీరు మనుసులా! రాక్షసులా! తాగుబోతు యదవల్లారా! మీకిలాటి సావొత్తే" అని గొణుక్కుంటూ ఆ శవంవెంటే నడిచి వెళ్ళింది.

వాడిని పూరవతల ఏటి ప్రక్కన చాలీ చాలని గొయ్యితీసి అందులో ఆ శవాన్ని విసిరేసి నాలుగు పారల మట్టిపోసి, సారాకొట్టు వయిపు వెళ్ళిపోయారు.

అదంతా దూరం నుంచి చూస్తూన్న పిచ్చిదానికి ఎందుకో దుఃఖం ఆగలేదు. మరికొంతసేపు ఏడుస్తూనే భయంవేసిందో ఏమో వెనక్కు తిరిగిపోయింది—తనలో తానే.

నీ! ఇదేటి? ఎప్పుడూ నేదు యీయాల? ఆడెవుడో సత్తే నేనేడుత్తా నేటి? అసలింతవరకూ ఎందుకు రావాల? నా బుద్ధి తక్కువ ఆడికీ నాకూ ఏటిసంబంధం? అందరూ ఇంతేకదా... కాపోతే గొప్పోళ్ళకు సవారీలు కడతారు. లేనోళ్ళకు లేదు. ఏటి కడితేనేం? ఉండిపోద్దా! ఆఖరి కందరూ మట్టిలో కలవ్వాలసిందేకదా! రేపో మాపో నేనూ అంతేకదా నన్నూ ఇట్టాగే ఈడిచేస్తారు కామోసు! అయ్యో! బ్రతుకా! అని మళ్ళీ ఏడుస్తూ వూళ్ళోకి పోయింది.

* * * *

ఆ వేళకు వారం రోజుల బట్టి తిండిలేదు అప్పన్నకి. ప్రయాణీకులు పార వేసిన ఎంగిలాకులలో అంటుకుపోయి మిగిలిపోయిన వాటిని కుక్కలని తరిమి తీసుకొని తింటున్నాడు. అదేం దురదృష్టమోగాని ఎంత అడుక్కున్నా చాలినన్ని డబ్బులు దొరకడంలేదు. కడుపు కాలుతుంటే మొఖం పీక్కుపోయి మరి లేచి అడుక్కునే శక్తి కూడా సన్నగిల్లి—ఆ రైలు పెట్టెలో దొడ్డి దగ్గర ఆ కంపు భరిస్తూ ఒదిగి ఒదిగి కూర్చుండిపోయాడు గమ్యంలేని ప్రయాణం చేస్తూ.

ఒక వూరిలో బండి ఆగేసరికి పెట్టెకు ఇద్దరేసి టికెట్ కలక్టర్లూ పోలీసులూ ఎక్కి టిక్కెట్లు లేనివారిని పట్టుకుంటున్నారు. ఇహ ముష్టి వాళ్ళని కాళ్ళతో తన్ని ఇవతలకు తోసేస్తున్నారు...ఆ విధంగా అప్పన్న కూడా ఆ వూరి ప్లాట్‌ఫారంమీద దిగేడు.

ముష్టివాడని కేసు లేకుండా వదిలేశారు. పోనీ జైలు కెళ్ళినా, వాళ్ళ పుణ్యమా అని ఇంత తిండి దొరుకునేమో!...కాని వాడి ముష్టి వాలకం దానికికూడా పనికి వచ్చిందికాదు! వీధినపడి కాళ్ళీడ్చుకుంటూ అడుక్కోడం మొదలు పెట్టేడు...కాని కడుపుకు చాలినంత దొరకడం లేదు.

"ఈ బ్రతుకు బ్రతక్కపోతే...పోరా! పోయి ఆ బ్రిడ్జికింద చావకూడదూ!" అని ఆ వూళ్ళో చాలామంది నోటంట విన్నాడు.

"చావొస్తే బావుణ్ను అని తనకూ వున్నా ఏమిటా బ్రిడ్జికింద చస్తే మోక్షం వస్తుందా? ఏమిటి చెప్మా?" అని అనుకున్నాడు తనలో.

తనకెవరయినా ఒక్క పైసా ఇస్తే చాలు 'ఎయ్యేళ్ళు సల్లగా బతుకు బాబూ?' అంటాడు. అటువంటుంది, ఒక్కరూ తనని బ్రతకమనరేం చెప్మా? అందరూ చావమనే కోరుతున్నారు. తనకూ చావాలనే వుంది! కాని తన చేతిలో వుందా? ఆరోజు రావాలి! చావాలి.

ఇంత బాధలు పడుతున్నా, తిండిలేక, బట్టలేక, శక్తిలేక నిలుచుండికి నీడలేకపోయినా ఇంకా బతికితే రోజులు బాగుంటాయేమోనని పిస్తది! సీ సీ! అంతా బెమమరి రోజులు బాగుపడేదేటి? అందరూ అన్నట్టు వేగిరం ఆ చావొస్తే బావుణ్ను...ఈ రైలును నమ్ముకునే ఇన్నాళ్ళా బ్రతికాను. రైలు పెట్టెలోనే అడుక్కుతిన్నాను. అంచేత చత్తే ఈ రైలుకిందేపడి సావాల! కాని అదేదో అలా చావబుద్ధి పుట్టదు రోత! ఒళ్ళంతా సితికిపోయి రకతం ముద్దయిపోయి అబ్బ! యదవ సావు యదవపసావో అని! అట్టాటి సావు ఎవరికీ వద్దు! సస్తే సూసినోళ్ళకు బావుండాల! సుబ్బరంగుండాల! ఎక్కడో నిదానంగా సావాల! అంతే!

అని అనుకున్నాడు అప్పన్న అంత దీనస్థితిలోనూ తన ఆలోచనలకి తానే నవ్వుకున్నాడు. ఆఖరికి నడవటానికి కూడా శక్తిలేక కూర్చునే దేకురుకుంటూ అడుక్కోడం మొదలెట్టాడు. ఇహ చావు తప్పితే వేరే విముక్తిలేదని నిశ్చయించుకున్నాడు. శక్తి సన్నగిల్లిపోయింది. కళ్ళు తిరిగిపోతున్నాయి. చెవులు గింగురు మంటున్నాయి.

"సచ్చిపోతే బావుణ్ను...సావొస్తే బావుణ్ను...బావుణ్ను... సచ్చిపోతే...సావొస్తే...బాధ బాధ...బావుణ్ను అలా దేకురుకుంటూ రైల్వేస్టేషన్ చేరుకున్నాడు.

అల్లంత దూరంలో బ్రిడ్జి చూశాడు. ఆ మెట్లక్రింద హాయిగా... చల్లగా...వుంటుంది. ఎండ తగలదు. వర్షం కురవదు. చలి వెయ్యదు

అబ్బా అక్కడకు చేరుకుంటే పడుకోవచ్చు. ప్రాణంపోయినా... హాయిగా వుంటుంది. తిండి లేకపోయినా చచ్చిపోవచ్చు తిండి– ఎండ, ఎండ తిండి...గాలి...చలి...గాలి–చలి రామ రామ...ఇలా అనుకుంటూ దేకుతుకుంటూ బ్రిడ్జి మెట్ల దగ్గరకు వచ్చాడు.

"అప్పుడే మరొకడు లిస్టులోకి చేరేడురోయ్!" అని ఎవరో అంటున్నారు వినీ వినబడ్డాయి...అప్పన్నకి.

మెట్ల క్రిందకు ఆత్రుతగా వెళ్ళేడు. కాని అతని ఆశ నిరాశ అయింది. అతని కోరిక తీరలేదు. అక్కడొకడు తయారు.

మొండి చేతులు మొండి కాళ్ళకి చేతులకి గుడ్డ పేలికలు రక్తం ముద్దలు ఈగలు ముసురుతూ పరమ అసహ్యంగా వున్నాడు. ఆ వ్యక్తి ముఖం అంతా గజ్జి గజ్జి ముక్కు లేనేలేదు.

"అయ్యో ఎందుకు వాడి జన్మ! ఎందుకు పుట్టించావు భగవంతుడా వేగిరం తీసుకుపోవా వెంకటరమణా" అని వాడిని చూసి అప్పన్న జాలిపడ్డాడు. ఆశ్చర్యం తనకి ఆలోచన ఏమిటి? ముష్టివాడికి అందం ఏమిటి? అని కూడా అనుకున్నాడు?

అప్పన్న అసహ్యంగా వుంటే వాడు పరమ అసహ్యంగా వున్నాడు. అయినా వాడిని చూస్తే ఆ క్షణంలో ఈర్ష్యగా వుంది అప్పన్నకి.

"ఒరే! ఆ నాలుగు రోడ్ల జంక్షన్‌లోకి పోయి అడుక్కోరాదూ... అక్కడ నాలుగు డబ్బులు దొరుకుతాయి. ఇక్కడెందుకీమూల!" అన్నాడు అప్పన్న.

ఆ మాట విని అదోలా చూశాడు వాడు. పత్తి పోగుల్లాటి కళ్ళు తిప్పి మాంసం ముద్ద కదిలినట్టు కదిలాడు పులిమీద పుట్రలా వీడెవడురా అనుకుంటూ.

"నువ్వే పోరాదూ అక్కడికి నా వూసు నీకెందుకూ?" అన్నాడు.

"నేనిక్కడ పడుకోవాల! నువ్వు పో."

"ఏటోస్! మా జాగా కొనేసినట్టు దమాయిత్తన్నవ్! నేనిక్కడ సత్తానుగాని కదల్ను..."

"అందుకేరా నిన్ను పొమ్మంది. నేనూ సావాల్నే వచ్చాను ఈ మెట్లకింద...సల్లగా...సావాలని బావరా! బాబ్బాబు! నువ్వెక్కడికయినా ఎల్లిబడురా...చచ్చి నీ కడుపున బుడతా..." అని బతిమాలుకున్నాడు అప్పన్న.

"అరె సన్నాసి! నీకు తెల్దే ఇక్కడ కాలెనోడు సచ్చి తీరాలి సత్తాడు అంతే. మరందికేగంద నేనొచ్చింది ఇంకా బతక మంటావా? యదవ బతుకులో ఏటుంది? నా జన్మ ఓ జల్మే! నువ్వొకడివన్నావ్ నన్ను బతకమని. ఎప్పుడో మా అమ్మ సీళ్ళోస్తూ అనేది. సిరంజీవి శతాయుస్సు అని అది గాపకమొస్తంది. ఏంటి స్తూసుకు బతక మంటావ్" అని వికారంగా నవ్వేడు.

వాడి మాటలకి అప్పన్నకి ఏడుపొచ్చింది. తనకన్నా ఘోరమైన బ్రతుకు వాడిది...తనకన్నా అర్జంటుగా చావవలసినవాడు.

"అంతేనంటావా? అని అడిగేడు.

"నన్నిలా సావనీవయ్యా అంతే!" అని కోపంగా అని తన ధ్యాసలో పడిపోయాడు వాడు.

మరి గత్యంతరంలేక అప్పన్న ఆ మెట్లమీదే పడుకుని యాచించడం మొదలెట్టేడు...ఆ కుష్ఠ స్నేహితుడు ఎప్పుడు చస్తాడా తను ఎప్పుడా చోటుకు పోదామా అని ఎదురుచూస్తూ గడుపుతున్నాడు.

అంతవరకూ బ్రతకడంకోసం ముష్టి తప్పదు.

రైళ్ళు వచ్చే వేళకు జనం ఎక్కువగా వచ్చి పోయేటప్పుడు అడుక్కొనే వాళ్ళు లేనప్పుడు ఇద్దరూ కబుర్లకు దిగేవారు.

"నీ పేరేటి?" అని అడిగేడు కుష్టువాడు అప్పన్నని.

అప్పన్న చెప్పేడు.

"అప్పన్నా నీ వూరేటి? నీ సంగతేటి?" అని అడిగాడు ఆ పేప విని కుతూహలంగా.

"మాది యిజయనగరం. కైరేతీ సత్రపు దగ్గర వుండేవోళ్ళం మా అయ్య అడుక్కోమని రైలు స్టేషన్‌కు పంపేవోడు. అక్కడ అడుక్కోని తెస్తే అందరం ఆ సత్రపుకాడ రావిసెట్టు క్రింద వండుకు తినేవోళ్ళం... ఆ రోజుల్లో మారాజులు ధర్మదాతలు అట్టాటి సత్రపులు ఎక్కడపడితే అక్కడుండేవి ఎన్నాళ్ళున్నా అడిగినోళ్ళు లేదు... మరి షావుకార్లో, అడిగితే సాలు ఆరోజు మరి అడుక్కోనక్కర్లేకుండా పెట్టేవోళ్ళు. ఇప్పటిలాగా కాలం మండిపోనేదు... ఆ రోజులే వేరు" అని ఒక్కసారి నిట్టూర్చి మళ్ళీ మొదలెట్టేడు.

"మా అమ్మా, అయ్యా పోయినాక, మరక్కడ వుండబుద్ధి ఎయ్యక రైలు బండిలో చిడతలు వాయిస్తూ వచ్చీ రాని పాటలు పాడుతూ అడుక్కునే వాడిని. సాయంత్రం అయ్యేసరికి, కైరేతీ సత్రవు చేరుకొని మూడు రాళ్ళు పెట్టుకొని ఎండు పుల్లలేరి మంటజేసి ఇంత ఉడకేసుకు తినేసి పెద్ద రావి చెట్టు క్రింద రాతి దిమ్మమీద సంచి తలకింద పెట్టుకు తొంగునే వాడిని.

అక్కడే లచ్చితో స్నేహం అయింది. నాకూ వయసొచ్చింది. లచ్చికూడా మంచి ఈడులో వుందేమో ఇట్టే స్నేహం కలిసిపోయింది. లచ్చి తండ్రి నాగులు ఉత్తి గుత్తినే గుడ్డోడిలా ఏసం యేసి ముష్టి ఎత్తుకునేవాడు. ఆడి సెయ్యి పట్టుకుని లచ్చి "గుడ్డోడు బాబూ ధర్మం సెయ్యండి" అని అబద్దాలు చెపుతూ దండుకొనేది.

నాతో కూడేక లచ్చి అప్పుడప్పుడు నాతో వచ్చేస్తూ వుండేది... నాగులు అది చూసి ఆఖరికి, ఆ సత్రపులోనే, తోటి ముష్టి వాళ్ళందర్ని పిల్చి మా ఇద్దరికీ పెళ్ళి చేసినాడు

"అప్పటి నుండి ఆ గుడ్డి యేసం వొదిలి, తన మానాన్న తను అడుక్కుందికి పోయేవోడు... నేనూ లచ్చి కలిసి బండిలో పాటలుపాడుకుంటూ తిరిగేవాళ్ళం... అలా వేరయిపోయినాము..."

ఇలా ఈ కథ అప్పన్న చెప్పేసరికి... ఆ కుష్ఠువాడు విల విల ఏడుస్తూ...

"అప్పన్నా... ఏమిట్రా..." అని బావురుమన్నాడు. అప్పన్న కేం అర్థంకాక ఆశ్చర్యపోయాడు.

"నన్ను పోల్చనేదట్రా... నాగుల్ని..."

ఆ మాట విని అప్పన్న మరీ ఆశ్చర్యపోతూ—

"నాగులు మాఁవా? ఇదేటి ఈ కరమ? ఇలాగయిపోయినావు?" అని ఏడిచాడు.

"అంతా పారబ్దం! మిమ్మల్ని వదిలి ఎల్లిపోనాక ఈ రోగం పట్టుకున్నాది. ముస్సెత్తుగుందికి ఇది బాగానేవున్నా... సీ... రోత!... సూడెలా అయిపోనాను. నా పని నేనే చేసుకోలేకపోతున్నాను. మీకోసం కొన్నాళ్ళు సూసి సూసి ఇక నాబంనేదనుకున్నాను. ఆఖరికి కాడికొచ్చాను." అన్నాడు కంట నీరుకారుతూంటే తుడుచుకుందికి చేతుల్లేక అవస్థపడుతూ.

"మరయితే లచ్చేది?" అని అడిగాడు ఆతృతతో ఆ నాగులు.

"ఏటి సెప్పను మావా? నువ్విడిచిపెట్టి ఎల్లాక మేమూ ఆ కైరేతి సత్రవు ఒగ్గేసినాం. ఇశాకపట్నం ఎల్లిపోయి సావుల మదుగుకాడ మకాం ఎట్టినాం. అక్కడి కెల్లడమే కొంప మునిగినాది. మాఁవా?...

మోగన్రావని ఓడు తగిలినాడు. ఎర్రగా బుర్రగా వున్నాడు ... అడో నెంబరు వన్ కేడిగాడంట. లచ్చిని సూసిన దగ్గర్నుంచి దానెంట పడ్డాడు. అది సూసినాను. ఒకటి రెండుసార్లు తిట్టినా ఒగ్గనేదు. ఎక్కడ కాజేసి తెచ్చేవోడో సీరలు, జాకెట్లు ఒక్కటేటి, లచ్చికళ్ళు బైర్లుకమ్మేసినట్టు ఏటేటో ఇచ్చేవోడు. సినీమాలకి ఎల్లేవోరు, ఒకనాడైతే బంగారం అబ్బా బంగారం గాజులు తెచ్చి యిచ్చాడు.

దాంతో లచ్చి ఆడి మోజులో పడిపోనాది. నేనెంత సెప్పినా ఇనుకోలేదు... ఆడితో ఎల్లిపోయి వారానికో, నెలకో, ఆడు జైలుకెళ్ళినపుడు ఒకచుట్టువచ్చి నన్నుచూసి మల్లి ఎల్లిపోయేది.

నాను సయించలేకపోనాను మాఁవా ఆల్లనీ యీల్లనీ అడిగితే అక్కడ గయిరమ్మని ఒకతె ఏదోమందిచ్చి అది లచ్చికి తినిపించమంది. లచ్చిని ఒదులుకోనేక, అదెంట తిరిగితే సహించనేక బుద్ధి గడ్డితిని— ఒకనాడు లచ్చి ఒచ్చి కూకుంటే అరటి పండులో పెట్టి ఆ మందు తినిపించినా మాఁవా...

అంతే మరి పది రోజులకల్లా లచ్చికి పిచ్చెత్తిపోనాది... మాఁవా ఆఖరికి నాకూ లేకండా, అదికీ లేకండా చేసుకున్నాను ... దురమార్గుణ్ణి. పోనీ నా దగ్గరే వుంచుకొని కనిపెట్టి సూద్దామనుకున్నానుగాని వుండేది కాదు. కొన్నాళ్ళు అక్కడా, ఇక్కడా కనబడేది. ఆ తరవాత మరి కనబడలేదు మాఁవా?

లచ్చిని ఎతుక్కుంటూ, ఊళ్ళంట అడుక్కుంటూ కాలం గడిచిపోతంది మాఁవా! ఆఖరికి ఈ వూరొచ్చి నిన్ను సూశాను మావా!"

—అని ఏడుస్తూ సిగ్గుతో తన కథంతా చెప్పేడు అప్పన్న.

"నా తల్లిని అన్నేయం సేసినావురో!" అని నాగులు మొత్తుగున్నాడు. ఆ బెంగతో ఆ మర్నాడే కళ్ళుమూశాడు.

అక్కడ నుండి నాగులుని మోసుకుపోతూంటే కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడు అప్పన్న. ఏం చేయడానికీ శక్తిలేదు... ఆఖరికి నాగులు శవంతో స్మశానానికి వెళ్ళడానికి కూడా ఓపికలేదు ... తను దండుకున్న డబ్బులు రెండు రూపాయల చిల్లర వుంటే అవి నాగులు శవంమీద పడేశాడు. వాటిని మోసినవాళ్ళు పట్టుగువెళ్ళిపోయారు.

ఆ రాత్రి పెద్ద గాలి, వర్షం వచ్చింది. అప్పన్నకి ఇష్టం వున్నా లేకపోయినా, ఆ వర్షానికి ఆ బ్రిడ్జి క్రిందకివెళ్ళి తలదాచుకోనక తప్పలేదు. తన అవస్థకి తనే నవ్వుకున్నాడు అప్పన్న.

ఆ వర్షానికి ఆ బ్రిడ్జిక్రింద జాగా కూడా జలమయం అయిపోయింది. అప్పన్న పూర్తిగా తడిసి ముద్దయిపోయాడు. గాలికి శరీరం కరడుగట్టిపోయింది. ఏ జ్వరంవచ్చిందోగాని ఆ మర్నాడుకల్లా అప్పన్న కూడా కొయ్యబారి చచ్చిపోయాడు.

అంతవరకూ వెదకిన లచ్చి– ఆ రోజే అక్కడకువచ్చి అప్పన్న శవాన్ని పోల్చుకోలేక పిచ్చికేకలు వేసిందని– శవంతోసహా శ్మశానానికి వెళ్ళి పూడ్చేవరకూ వుండి ఏడ్చిందని ... ఆ పిచ్చిదే తన లచ్చి అని అప్పన్నకు తెలియదు.

ఏమిటో– ఎందుకలా చేస్తూందో తెలియకుండా ఆ పిచ్చితోనే అప్పన్న శవంతో వెళ్ళి ఏడ్చి ఋణాన బంధం తీర్చుకున్న లచ్చికి ... ఆ శవం– భర్తదే అని తెలియదు...

పిచ్చిదాని పరిస్థితి రోజు రోజుకీ దిగజార జొచ్చింది. వంటిమీద సరిగ్గా బట్టలేదు. తినడానికి తిండిలేదు. అనారోగ్యంచేత ఒళ్ళంతా పొంగి పోయింది. నడవడానికి శక్తిలేక ఆమెకూడా ఆ బ్రిడ్జిక్రిందనే వచ్చిచేరింది కూర్చుని అడుక్కుతిందామని

“చావాలని వుందా? నువ్వూ ఇక్కడకు చేరావు?” అని ఎవరో అడుగుతున్నారు.

బ్రిడ్జిక్రింద చేరిన పిచ్చిది ఆ మాటలు విని అయోమయంగా అటు వైపు చూసింది.

అక్కడకువచ్చి తను మొదట చూసిన దృశ్యం జ్ఞాపకంవచ్చింది. అక్కడ చచ్చినవాడి శవాన్ని గాడిదలా చాపకు చుట్టబెట్టి అమానుషంగా మోసుకుపోయిన దృశ్యం కళ్ళకు కనిపించి, భయంతో విరక్తితో నవ్వుకుంది.

ఆంధ్రజ్యోతి, 23-7-76.